# 12. నోటిదురుసు, దుర్భాష

నోరు మంచిదయితే ఊరు మంచిదవుతుందంటారు. నోరు ఎన్నెన్నో మంచి పనులు చేస్తుంది. మనిషి గౌరవమర్యాదల్ని పెంచి, సంఘంలో అతనికి మంచి స్థానం సమకూర్చి పెడ్తుంది. అయితే అదుపుతప్పితే ఈనోరే మనిషికి ఇహపరాల్లో ఎన్నో ఆపదలు తెచ్చి పెడ్తుంది. దేవుని దృష్టిలో నోటిదురుసు, దుర్భాష, అశ్లీలం ఘోరమైన నేరాలు. వీటికి పరలోకంలో మనిషి నరకశిక్ష అనుభవించవలసి వస్తుంది. వీటిని గురించి దైవప్రవక్త (స) ఇలా ప్రవచించారు:

"ప్రళయదినాన విశ్వాసి త్రాసులో ఉంచబడే బరువైన వస్తువు అతని సత్ప్రవర్తనే. అశ్లీలమాటలు పలికేవాడ్ని, దుర్భాషలాడేవాడ్ని దేవుడు అసహ్యించుకుంటాడు." (తిర్మిజి)

"మృదుస్వభావం లేనివాడిలో మంచితనం ఉండదు." (జరీర్-ముస్లిం)

కొందరు పైకిఎంతో భక్తిపరాయణులుగా కన్పించినా, వారు తమ నోటితో ఇతరుల్ని తరచుగా బాధిస్తుంటారు. అలాంటివారికి ఈ క్రింది హదీసు చక్కని గుణపాఠం.

ఒకతను దైవప్రవక్త (స) దగ్గరకు వచ్చి "ఫలానా స్త్రీ ఎన్నో నఫిల్ నమాజులు చేస్తుంది. మరెన్నో నఫిల్ ఉపవాసాలు పాటిస్తుంది. (పెద్దఎత్తున) దానధర్మాలు కూడా చేస్తుంది. ఈ సత్కార్యాలలో ఆమె పేరుపొందింది. కానిఆమె తరచుగా నోటితో ఇరుగు పొరుగువారిని బాధిస్తుంది" అన్నాడు. దానికి దైవప్రవక్త (స) "అయితే ఆమె నరకానికి పోతుంది" అన్నారు. తిరిగి ఆ వ్యక్తి ఇలా అన్నాడు: "దైవప్రవక్తా! ఫలానా స్త్రీ నఫిల్ ఉపవాసాలు చాలా అరుదుగా పాటిస్తుంది. నఫిల్ నమాజులు కూడా చాలా తక్కువ గానే ఆచరిస్తుంది. అప్పుడప్పుడు కొన్ని జున్ను గడ్డల్ని దానం చేస్తుందని ప్రతీతి. అయితే ఆమె తన నోటితో ఇరుగుపొరుగువారిని బాధించదని జనం చెప్పుకుంటారు." దైవప్రవక్త ఈమాట విని "ఆమె స్వర్గవాసి అవుతుంద"ని చెప్పారు. (మిష్కాత్)

హ్రజత్ అబ్దుల్లా బిన్ అమ్రిబిన్ఆస్ (రజి) ప్రకారం దైవప్రవక్త (స) ఇలా అన్నారు: "ఎవరి నోటి మూలంగా, చేతుల మూలంగా తోటిముస్లింలు బాధపడకుండా ఉంటారో అతనే (నిజమైన) ముస్లిం. అలాగే దేవుడు మానేయమన్న వాటిని మానేసేవాడే ముహాజిర్ (దైవమార్గంలో వలసపోయినవాడు)." (బుఖారీ, ముస్లిం)

హ్రజత్ ఆయిషా (రజి) కథనం: ఒక వ్యక్తి లోపలికి రావడానికి దైవప్రవక్త (స)ను అనుమతి అడిగాడు. దైవప్రవక్త (స) "అతడ్ని లోపలికి రావడానికి అనుమతించు. అతను తన వంశంలోని అతి చెడ్డవాడు" అని అన్నారు. ఆ వ్యక్తి లోపలికి వచ్చిన తరువాత దైవప్రవక్త (స) అతనితో ఎంతో సౌమ్యంగా మాట్లాడారు. (అతను వెళ్ళిపోయిన) తర్వాత నేను దైవప్రవక్త (స)తో మాట్లాడుతూ "దైవప్రవక్తా! మీరా మనిషి గురించి మొదట అలా అన్నారు. కాని ఆ తరువాత అతనితో చాలా సౌమ్యంగా మాట్లాడారేమిటీ?" అని అడిగాను. దానికి దైవప్రవక్త (స) సమాధానమిస్తూ "ఆయిషా! ఎవరి నోటిదురుసు వల్ల ప్రజలు తనకు దూరమైపోతారో అతను పరమ దుర్మార్గుడు" అని అన్నారు. (బుఖారి)



దైవప్రవక్త (స) ఇలా ప్రవచించారు: "దేవుణ్ణి, అంతిమదినాన్ని విశ్వసించే వ్యక్తి పలికితే మంచిమాటే పలకాలి లేదా మౌనంగా ఉండాలి." (బుఖారీ, ముస్లిం)

దైవప్రవక్త (స) హితోక్తి: "తన రెండు దవడల మధ్య ఉన్నదాన్ని గురించి, రెండు కాళ్ళ మధ్య ఉన్నదాన్ని గురించి నాకు హామీ ఇచ్చే మనిషికి నేను స్వర్గం గురించి హామీ ఇస్తాను." (బుఖారీ, ముస్లిం)

హ్రజత్ అబూహురైరా (రజి) ప్రకారం దైవప్రవక్త (స) ఇలా అన్నారు: "దాసుడు అనాలోచితంగా ఒక మాట అంటాడు. అది మంచా లేక చెడా అని ఆలోచించడు. కాని దాని మూలంగానే అతను తూర్పు పడమరల మధ్య ఉండే దూరం కన్నా ఎక్కువ దూరం నరకం వైపు పడిపోతాడు." (బుఖారీ, ముస్లిం)

దైవప్రవక్త (స) ఇలా బోధించారు: "దాసుడు పరధ్యానంలో ఉండి దేవునికి నచ్చే మాట మాట్లాడేస్తాడు. దానివల్ల దేవుడు అతని అంతస్తులెన్నో పెంచుతాడు. అయితే దాసుడు ఒక్కోసారి పరధ్యానంలో ఉండి దేవునికి ఆగ్రహం తెప్పించే మాట మాట్లాడేస్తాడు. దానివల్ల అతను నరకంలో పడి పోతాడు." (బుఖారీ)

హ్రజత్ సుఫ్యాన్ బిన్ అబ్దుల్లా (రజి) కథనం: నేనొక సారి దైవప్రవక్త (స)ను ఇలా అడిగాను: "దైవప్రవక్తా! నాకేదయినా విషయం నేర్పించండి, నేను దాని మీద స్థిరంగా ఉంటాను." అందుకాయన "నా ప్రభువు అల్లాహ్ అని చెప్పి ఆ మాట మీదే స్థిరంగా ఉండు" అని ఉపదేశించారు. నేను మళ్ళీ అడిగాను, "దైవప్రవక్తా! నా గురించి మీరు ఏ విషయంలో భయపడుతున్నారు" అని. అందుకాయన తన నాలుక పట్టుకొని, "దీని విషయంలో" అని అన్నారు. (తిర్మిజీ)

దైవప్రవక్త (స) ఇలా చెప్పారు : "దైవస్మరణ లేకుండా ఇతర మాటలు ఎక్కువగా మాట్లాడకండి. దైవస్మరణ లేకుండా ఇతర మాటలు ఎక్కువగా మాట్లాడితే హృదయాలు మొద్దుబారిపోతాయి. దేవునికి ప్రజలందరి లోకెల్లా దూరంగా ఉండేవాడు హృదయం మొద్దుబారి పోయినవాడే." (తిర్మిజీ); "(నిజమైన) విశ్వాసి ఎత్తిపొడిచేవాడు, శాపనార్థాలు పెట్టేవాడు, బూతు మాట్లాడేవాడు, దురుసుగా మాట్లాడేవాడు కాలేడు." (తిర్మిజీ)

హ్రజత్ ఉఖ్బా బిన్ ఆమిర్ (రజి) కథనం: నేను దైవప్రవక్త (స)ను అడిగాను, "దైవప్రవక్తా! ముక్తికి మార్గం ఏద"ని. అందుకాయన "నీ నోటిని అదుపులో పెట్టుకో. నీ ఇల్లు నిన్ను తనలో ఇమిడ్చుకోవాలి (అంటే నీ తీరిక సమయం నీ ఇంట్లో గడవాలి.) నీ పొరపాట్లను తలచుకొని రోదించు" అని ఉపదేశించారు. (తిర్మిజీ)

హ్రజత్ అబూసయీద్ ఖుద్రీ (రజి) ప్రకారం దైవప్రవక్త (స) ఇలా అన్నారు: "తెల్లవారుజామున మనిషి శరీరంలోని అవయవాలన్నీ నాలుకను అత్యంత దీనంగా బతిమాలుతాయి. "నువ్వు మా విషయంలో దేవునికి భయపడి మసలుకో. మా వ్యవహారం నీతో ముడిపడిఉంది. నువ్వు సవ్యంగాఉంటే మేమూ సవ్యంగా ఉండ గలుగుతాం. నువ్వు వక్రతకు లోనైతే మేమూ వక్రతకు లోనైపోతాము." (తిర్మిజీ)